# ‘‘ ఫోన్‌లో ఫ్లైట్ మోడ్ ఎందుకు?

ప్రస్తుత స్మార్ట్ యుగంలో మొబైల్ ఫోన్ నిత్యావసరవస్తువుగా మారిపోయింది. అందరికీ ఆత్మీయనేస్తంగా చేరువైంది. ఫోన్‌లో చార్జింగ్, నెట్‌వర్క్ ఉంటే చాలు ఎక్కడైనా కావాల్సిన సమాచారం అందిస్తుంది. అయితే.. విమాన ప్రయాణంలో మాత్రం మొబైల్ ఫోన్ వాడకం నిషేధం. ఫోన్ వాడినా దాంట్లో నెట్‌వర్క్ మాత్రం కచ్చితంగా ఆపేయాల్సిందే. ఇందు కోసం ఏకంగా ఫోన్‌లో ఫ్లైట్ మోడ్ ఆప్షన్ కూడా ఉంటుంది. ఇంతకీ ఫ్లైట్‌లో ఫోన్ ఎందుకు వాడకూడదో తెలుసా?

**మనం** విమానం ఎక్కగానే ఫోన్‌లో నెట్‌వర్క్ ఆపకపోతే అది విమానం నావిగేషన్ సిస్టమ్‌తో జోక్యం చేసుకోవచ్చు. దీని కారణంగా విమానం ఎగరడంలో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే.. ప్రమాదాలకు దారితీయవచ్చు. మొబైల్ ఫోన్ నుంచి వచ్చే సిగ్నల్స్ విమానం కమ్యూనికేషన్ వ్యవస్థను గందరగోళానికి గురిచేస్తుంది. దీని కారణంగా పైలట్‌తో కమ్యూనికేట్ చేయడంలో సమస్య ఉత్పన్నం కావొచ్చు. అలాగే కమ్యూనికేషన్ నియంత్రణలోనూ వైఫల్యాలు ఏర్పడుతాయి. దీనివల్ల విమానం రేడియో స్టేషన్‌తో సంబంధాన్ని కోల్పోవచ్చు కూడా! ఫలితంగా భారీ ప్రమాదాలు జరగొచ్చు. అందుకే, విమానంలో మొబైల్స్‌ను ఫ్లైట్ మోడ్‌లో ఉంచడం తప్పనిసరి!




నమస్తే తెలంగాణ

# జిందగీ II

హైదరాబాద్ | శుక్రవారం 10 మే 2024 www.ntnews.com




**ఒకరు వాడిన దుస్తులు మరొకరు కొనుక్కుని వేసుకోవడం పేదరికం కాదు... పెద్దరికం అంటుంది హైదరాబాద్‌కు చెందిన గుడివాడ వైష్ణవి. ఎందుకంటే, అలా చేస్తున్న వారంతా ఈ పుడమిని కాపాడాలన్న పెద్దమనసు ఉన్నవాళ్లే అన్నది ఆమె మాట. ‘ఒక్కో వస్త్రాన్ని, ఒక్కో వస్తువును మళ్లీ వాడుతున్నామంటే దాని తయారీకి అవసరమైన ప్రకృతి వనరుల్ని... తద్వారా ఆర్థిక వనరుల్ని కాపాడినట్టే కదా!’ అని చెబుతుంది. హైదరాబాదీ థ్రిఫ్టర్స్ పేరిట ఈమె నడుపుతున్న గ్రూపు కొన్ని వేల దుస్తులు, వస్తువులకు మళ్లీ ప్రాణం పోసింది. అంతేకాదు, రసాయన రహిత సౌందర్య ఉత్పత్తుల్ని తక్కువ ధరలో అందించాలన్న ఉద్దేశంతో ఇకో స్టూడియో అనే సంస్థనూ ప్రారంభించిన వైష్ణవి.. సిసలైన పర్యావరణ ప్రేమికురాలు!**






# థ్రిఫ్టింగ్.. ప్రకృతికి గిఫ్టింగ్!



**మనం** మూడు చోట్ల జీవిస్తాం. మొదటిది శరీరం. రెండోది మనసు. మూడోది భూమి. ఈ మూడూ మనవే. కాబట్టి ఈ మూడిటినీ కాపాడుకోవాల్సిన బాధ్యతా మనదే. ఇందుకు అనుగుణంగా ఆలోచనలు, పనులు చేయడానికే నేను ఇష్టపడతా. థ్రిఫ్టింగ్ కూడా ఈ కోవలోదే. ఇందులో మనం ఒకరు వాడిన చుడిదార్‌నో, హ్యాండ్‌బ్యాగ్‌నో కొనుక్కుంటాం. మన దగ్గర ఉన్న అక్కర్లేని వస్తువుల్ని అవసరమైన వారికి అమ్ముతాం. కాబట్టి ఇక్కడ మరో హ్యాండ్‌బ్యాగ్ తయారీకో, లేదా డ్రెస్ ఉత్పత్తికో అవసరమైన వనరుల్ని కాపాడినట్టే. అంతేకాదు, ముందే ఉపయోగించిన వనరులను రెండింతలు వినియోగించుకున్నట్టు కూడా. ఒకసారి వాడిన వస్తువుకు మళ్లీ విలువ కల్పించడమంటే మార్కెట్లోకి మళ్లీ ప్రవేశ పెట్టినట్టే. అందుకే మా థ్రిఫ్టింగ్ గ్రూప్‌లో ఉన్నవాళ్లంతా తమకు అవసరమైన వస్తువుల్ని ఇలానే కొనుగోలు చేస్తారు. అందుబాటు ధరకు కొంటున్నామనే కాదు, నేల మీది వనరుల్ని కాపాడేందుకు తమవంతు సాయం చేస్తున్నామన్న భావనా ఇందులోని ప్రతి ఒక్కరి మనసులో ఉంటుంది. అయితే ఈ ఆలోచన రావడానికి నాకు ఎదురైన ఓ సందర్భమే ప్రేరణగా నిలిచింది.




### ప్రాజెక్టు నేర్పింది...

చిన్నప్పుడు నాన్న ఉద్యోగ రీత్యా కొన్నాళ్లు గుజరాత్‌లో ఉన్నాం. మిగతా అంతా హైదరాబాద్‌లోనే. ఇక్కడి సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్స్ చేశాను. అప్పుడు ‘ట్రాష్ మేనేజ్‌మెంట్’ (చెత్త నిర్వహణ) అంశాన్ని ప్రాజెక్టుగా ఎంచుకున్నా! అందులో భాగంగా మేం కొందరం హైదరాబాద్‌లో చెత్త డంప్ చేసే ప్రాంతాల్లో ఒకటైన గుడిమల్కాపూర్ సందర్శించాం. దానికి సంబంధించిన రిపోర్టులు తయారు చేసుకున్నాం. చెత్త సేకరించే వాళ్లు కుప్పల్లోంచి వైర్లు, గాజు వస్తువులు, అట్టపెట్టెలు... వేరు చేస్తూ వాటిని అమ్ముకుంటున్నారు. అంటే మనకు పనికిరావు అనుకున్నవి మరో చోట అవసరమవుతాయనే ఆలోచన వచ్చిందప్పుడు. కొన్నాళ్లు నా మనసులో అది అలాగే ఉండిపోయింది. నా దగ్గర నేను ఇక వాడను అనిపించిన మంచి డ్రెస్‌లు, ఫ్యాన్సీ నగలు, యాక్సెసరీల్లాంటివి చాలా పోగయ్యాయి. కొన్నిటిని చూసి నా ఫ్రెండ్స్ ‘భలే ఉన్నాయే!’ అనేవాళ్లు. నచ్చితే తీసుకోండి, బదులుగా మీ దగ్గరి వాటిలో నాకు ఏవైనా ఇవ్వండి అని చెప్పేదాన్ని. అప్పుడు ఇద్దరం హ్యాపీ కదా! ఇదే ఉద్దేశంతో నా నేస్తాలతో హైదరాబాదీ థ్రిఫ్టర్స్ పేరిట ఓ వాట్సప్ గ్రూపు, ఇన్‌స్టా గ్రూపు, కమ్యూనిటీలను ప్రారంభించాను. నేను అప్పటికే సుస్థిరాభివృద్ధి, వ్యర్థాల నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవడం లాంటి అంశాల మీద నా ఇన్‌స్టాలో పోస్టులు పెడుతూ ఉండేదాన్ని. అక్కడ నాకు రెండు వేల మంది దాకా ఫాలోవర్లు ఉన్నారు. వాళ్లలో ఎక్కువమంది పర్యావరణ స్పృహ ఉన్నవాళ్లే. దాంతో ఈ గ్రూపుల్లో వాళ్లు ఉత్సాహంగా చేరారు.

### ఏమేం ఉంటాయంటే...

2019 మధ్యలో నేను ‘హైదరాబాదీ థ్రిఫ్టర్స్’ గ్రూపు ప్రారంభించినప్పుడు పదిమందిలోపే సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య 600 పైచిలుకు ఉంది. దీన్ని చూసుకునేందుకు అయిదారుగురు పనిచేస్తున్నారు. ఇందులో క్యాజువల్ వేర్, పార్టీవేర్, ఫ్యాషన్‌వేర్ దుస్తులతోపాటు చెప్పులు, బూట్లు, హ్యాండ్‌బ్యాగులు, సౌందర్య ఉత్పత్తులు... ఇలా అన్నీ పోస్ట్ చేస్తాం. హోమ్ డెకరేటివ్స్, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లలాంటివీ ఇందులో మూడోవంతు ధరలో అమ్మకానికి ఉంటాయి. గ్రూపు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ 10 వేల వస్తువులు పోస్ట్ అయ్యాయి. ఇవికాక నెలలో ఒకటిరెండు సార్లు హైదరాబాద్‌లో థ్రిఫ్టింగ్ ఈవెంట్ నిర్వహిస్తుంటాం. తెలంగాణలో ఇది తొలి థ్రిఫ్టర్స్ గ్రూప్. ఇందులోని సభ్యులంతా ఆడవాళ్లే. విద్యార్థినులు, గృహిణులు, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ఎంప్లాయీస్.. ఇలా విభిన్న వర్గాలకు చెందినవారు ఇందులో ఉన్నారు. వీళ్లలో ఎక్కువమంది 19 నుంచి 45 ఏండ్ల మధ్యవాళ్లు. ఒకరి దుస్తులు ఒకరు వేసుకోవడం తప్పులాంటి మూఢ నమ్మకాలుగానీ, వేరే వాళ్లు వాడినవి మనం వాడటమేంటి అన్న అహంభావం కానీ వీళ్లలో అస్సలు కనిపించవు. ఇక, మా గ్రూపులో కొంతమంది బెంగళూరుకు మారిపోవడంతో ‘బెంగళూరు థ్రిఫ్టర్స్’ అని ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. మా స్ఫూర్తితో హైదరాబాద్‌లోనూ మరికొన్ని గ్రూపులు ఏర్పడుతున్నాయి. ఇది మంచి పరిణామం.



### అందుబాటులో...

మనం రోజువారీ వాడే షాంపూలు, సబ్బులు, పేస్టుల్లాంటి వాటిలో కెమికల్స్ కలిసి ఉంటాయి. వాటిని తగ్గించుకున్నా మనం నేలను కాపాడినట్టే. అందుకే ‘ఇకో స్టూడియో’ పేరిట ఒక రసాయన రహిత ఉత్పత్తుల సంస్థను ప్రారంభించాను. కెమికల్ ఫ్రీ అనేవన్నీ ఇటీవల చాలా ఖరీదుగా అమ్ముతున్నారు. కానీ, కాలేజీ పిల్లలూ వాడగలిగేలా ఉండాలన్న ఉద్దేశంతో 5 రూపాయల నుంచి 400 రూపాయల వరకు మాత్రమే ధర ఉండేలా వీటిని తయారుచేస్తున్నాం. సున్నిపిండి, పండ్లపొడిలాంటి వాటితోపాటు క్లెన్సర్, స్క్రబ్, ఫేస్‌మాస్క్ తదితర 60 దాకా ఉత్పత్తుల్ని ఇందులో అమ్ముతున్నాం. వీటి మీద వచ్చిన డబ్బులో 20 శాతం వీధికుక్కలను సంరక్షించే సంస్థకు ఇస్తున్నాం. ఇవన్నీ ఎందుకంటే, మార్పు అనేది చాలా చిన్నగానే మొదలవుతుంది. కానీ నిరంతరం కొనసాగించే చిన్నమార్పులే ఒక పెద్ద ప్రయోజనానికి దారితీస్తాయి. ఆ దిశగా మనం చేసే ప్రతి పనీ లెక్క వేయదగ్గదే. ఉదాహరణకు ప్లాస్టిక్ బాక్సులకు బదులు స్టీలు బాక్సులు, ప్లాస్టిక్ బ్రష్‌ల స్థానంలో వెదురు బ్రష్‌లు వాడటం, రసాయన రహిత రంగుల్ని వినియోగించడం, పునర్వినియోగ ప్యాడ్‌లను కొనుక్కోవడం... ఇలా ప్రతి అడుగులోనూ నేను పర్యావరణహితాన్ని చూస్తాను. మేం హిమాలయాలకు ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు కూడా మా బాక్సులు, వాటర్ బాటిళ్లు పట్టుకెళ్లాం. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించుకున్నాం. జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రిప్ అది. ఇలాగే... ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్నది సులభం అయిపోతుంది. ఆ మార్పు దిశగా నా ప్రయాణం ఎప్పటికీ కొనసాగుతుంది!


... ✍ లక్ష్మీహరిత ఇంద్రగంటి


# స్పైసీ ఎగ్ కర్రీ

కిచెన్ మంత్ర



**కావలసిన పదార్థాలు**

**గుడ్లు:** నాలుగు, **టమాట గుజ్జు:** ఒక కప్పు, **ఉల్లిగడ్డ:** ఒకటి, **పచ్చిమిర్చి:** రెండు, **కరివేపాకు:** రెండు రెబ్బలు, **అల్లం వెల్లుల్లి పేస్ట్:** ఒక టీస్పూన్, **ధనియాల పొడి:** ఒక టీస్పూన్, **గరం మసాలా:** అర టీస్పూన్, **పసుపు:** పావు టీస్పూన్, **కారం:** రెండు టీస్పూన్లు, **ఉప్పు:** తగినంత, **నూనె:** పావు కప్పు, **దాల్చిన చెక్క:** చిన్న ముక్క, **జీలకర్ర:** అర టీస్పూన్, **కొత్తిమీర తురుము:** కొద్దిగా.

**తయారీ విధానం**

గుడ్లను ఉడకబెట్టి పెంకు ఒలిచి గాట్లు పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె వేడయ్యాక జీలకర్ర, దాల్చిన చెక్క వేసి బాగా వేగాక సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. అన్నీ బాగా వేగాక టమాట గుజ్జు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, ధనియాలపొడి, కారం, ఉప్పు వేసి సన్నని మంటపై నూనె పైకి తేలేంత వరకు కలుపుతూ ఉడికించాలి. చివరగా ఉడికించిన గుడ్లు, గరం మసాలా, కొత్తిమీర తురుము వేసి మరో నిమిషం పాటు ఉడికించి దించుకుంటే స్పైసీ ఎగ్ కర్రీ సిద్ధం.

# ఈ పండ్లు ఫ్రిజ్‌లో వద్దు

**ఇటీవలి కాలంలో రిఫ్రిజిరేటర్ ఒక ముఖ్యమైన గృహ ఉపకరణంగా మారిపోయింది. మాంసం, పాల ఉత్పత్తులు, పండ్లు , కూరగాయలు లాంటివాటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి ఫ్రిజ్‌లో ఉంచుతుంటారు. అయితే, కొన్ని రకాల పండ్లను ఫ్రిజ్‌లో ఉంచకూడదని చెబుతున్నారు నిపుణులు. ఇలా ఉంచడం వల్ల అవి త్వరగా పాడవడమే కాకుండా, విషపూరితంగా మారే ప్రమాదం ఉంది.**



**అరటిపండ్లు :** అరటిపండును రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే చాలా త్వరగా నల్లగా మారుతుంది. ఈ పండ్ల నుంచి ఇథిలీన్ వాయువు బయటికి వస్తుంది. దీనివల్ల ఫ్రిజ్‌లో ఉంచిన ఇతర పండ్లు త్వరగా పక్వానికి వచ్చేలా చేస్తుంది! కాబట్టి అరటిపండ్లను ఎప్పుడూ ఫ్రిజ్‌లో, ఇతర పండ్లతో కలిపి ఉంచకూడదు.

**పుచ్చకాయ :** వేసవిలో పుచ్చకాయను ఎక్కువగా తింటారు. ఈ పండు చాలా పెద్దది కాబట్టి ఒక్కసారిగా తినడం కష్టం. అందుకే చాలా మంది పుచ్చకాయ ముక్కలను రిఫ్రిజిరేటర్‌లో భద్రపరుస్తారు. ఇలా ఉంచితే ఆ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు పాడైపోతాయి. తినడానికి ముందు కొంత సమయం వరకు వాటిని రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల పెద్దగా ఇబ్బంది ఉండదు.

**యాపిల్ :** యాపిల్ పండ్లను రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే అవి త్వరగా పండిపోతాయి. యాపిల్‌లో ఉండే క్రియాశీల ఎంజైమ్‌ల కారణంగా ఆపిల్ త్వరగా పండుతుంది. వీటిని ఎక్కువ కాలం నిల్వ చేయాలనుకుంటే కాగితంలో చుట్టి ఉంచడం మంచిది. రేగు, చెర్రీస్ వంటి విత్తనాలు ఉన్న పండ్లను కూడా రిఫ్రిజిరేటర్‌లో ఉంచకూడదు.

**మామిడి :** మామిడిని రిఫ్రిజిరేటర్‌లో పెట్టకూడదు. దీనివల్ల మామిడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తగ్గుతాయి. పోషకాలు కూడా నశిస్తాయి.

**లిచీ పండ్లు :** లిచీని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల పైభాగం బాగానే ఉన్నా గుజ్జు లోపలి భాగం త్వరగా పాడవుతుంది.

# ఏ వైపు తిరిగి పడుకుంటున్నారు?

**నిద్రపోయేటప్పుడు** ఒక్కొక్కరూ ఒక్కో పొజిషన్‌లో పడుకుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే కొందరు ఎడమవైపు, మరికొందరు కుడివైపు తిరిగి పడుకుంటారు. కొందరికి బోర్లా పడుకునే అలవాటు కూడా ఉంటుంది. అయితే పడుకునే పొజిషన్ కూడా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అన్నిరకాల పొజిషన్ల కంటే ఎడమవైపు తిరిగి పడుకుంటే శరీరంలో చాలా రకాల వ్యవస్థల పనితీరు బాగుంటుందని చెబుతున్నారు.



తరచుగా గుండెలో మంట, ఎసిడిటీతో బాధపడుతుంటే, నిద్రపోయేటప్పుడు ఎడమవైపు తిరిగి పడుకోవడం మంచిది. ఈ స్థితిలో జీర్ణాశయాన్ని, అన్నవాహికను కలిపే స్ఫింక్టర్‌కు కొంచెం కిందుగా జీర్ణాశయం ఉంటుంది. అందువల్ల ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణాశయంలోని పదార్థాలు, యాసిడ్ వెనక్కి వచ్చే అవకాశం ఉండదు. అందువల్ల ఎసిడిటీ సమస్య రాదు. కాలేయం శరీరానికి కుడివైపు ఉంటుంది. కాబట్టి కుడివైపు తిరిగి పడుకుంటే దీనిపై ఒత్తిడి పడుతుంది. శరీరంలోని టాక్సిన్లు కాలేయాన్ని చేరేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎడమవైపు తిరిగి పడుకుంటే శరీరంలోని హానికర పదార్థాలు, టాక్సిన్లు కాలేయంపై భారం వేయకుండా నివారించవచ్చు. గుండె ఎడమవైపు భాగం ఊపిరితిత్తుల నుంచి రక్తాన్ని తీసుకుని మిగిలిన శరీర భాగాలకు పంపిస్తుంది. అందువల్ల ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల గుండె పంపింగ్ సామర్థ్యం మెరుగవుతుంది.

# అదిరిందమ్మా.. మిస్సమ్మ





పెండ్లి, పేరంటం, పండుగ, నైట్ పార్టీ, మార్నింగ్ ఫంక్షన్.. ఇలా ఒక్కో సందర్భానికి ఒక్కో రకమైన దుస్తులు ధరిస్తారు మహిళలు. సంప్రదాయమైనా, ఆధునికమైనా.. ఆయా దుస్తుల మీద అమరిపోయే మ్యాచింగ్ నగలు ఉంటేనే మగువల అలంకరణ పూర్తవుతుంది. దుస్తులకు నప్పే రంగు, డిజైన్లకు అనుగుణంగా ఆభరణాలను ఎంచుకుని ముస్తాబవుతారు. అయితే మ్యాచింగ్ నగలకు పోటీగా అతివల అలంకరణలో చేరి సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నది మిస్ మ్యాచింగ్ జువెలరీ. రంగు, పరిమాణం, ఆకారాల్లో ఏదో ఒక తేడాను కలిగి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఈ మిస్ మ్యాచింగ్ జువెలరీ విశేషాలు మీకోసం..

**మహిళల** అలంకరణలో చెవులకు జుంకాలు, చేతులకు గాజులు, కాళ్లకు పట్టీలు ఎప్పుడూ ప్రత్యేకమే. సాధారణంగా ఇవి రెండిటికీ ఒకేలా ఉంటాయి. రెండు చెవులకూ ఒకే రకమైన కమ్మలు, రెండు చేతులకూ ఒకే డిజైన్ గాజులు వేసుకుంటారు. కానీ, మిస్ మ్యాచింగ్ జువెలరీ మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నం. ఇందులో ఒక చెవికమ్మ పెద్దగా, మరొకటి చిన్నగా ఉంటాయి. మిస్ మ్యాచింగ్ ట్రెండ్ ఎంతవరకూ వెళ్లిందంటే.. ఒక చెవికి చంద్రుడు వేలాడుతుంటే, మరోచెవిని సూర్యుడు పట్టుకుంటాడు. ఒకవైపు నక్షత్రం మెరిస్తే.. ఇంకోవైపు నుంచి నెలవంక తొంగి చూస్తుంటుంది. ఒకటి ముదురు రంగులో ముచ్చట గొలిపితే, మరొకటి లేత రంగులో మనసు దోచుకుంటుంది. ఇలా.. రెండు నగలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉంటూనే అందాన్ని రెట్టింపు చేస్తూ అందరిలోనూ ప్రత్యేకంగా నిలుపుతాయి. రెండు చేతులకు ఉండే గాజులు విభిన్న సైజుల్లో, డిజైన్లలో అందరి దృష్టినీ ఆకర్షిస్తాయి.





**ఈ** మిస్ మ్యాచింగ్ జువెలరీ ఆధునిక దుస్తులపైనే కాకుండా సంప్రదాయ వస్త్రశ్రేణిపైనా చక్కగా నప్పుతుంది. అంతేకాదు దీనిని అభిరుచికి తగినట్లుగా డిజైన్ చేయించుకునే సౌలభ్యం కూడా ఉంది. ఆన్‌లైన్ అంగళ్లలో కస్టమైజ్డ్ డిజైన్లు చేసుకునే సౌలభ్యమూ ఉంది. బంగారం, వెండి, ప్లాటినమ్ వంటి ఖరీదైన లోహాలతో చేసిన ఆభరణాలే కాకుండా అందరికీ అందుబాటులో ఉండే వన్‌గ్రామ్ గోల్డ్, ఇమిటేషన్ జువెల్లరీలోనూ ఈ నగలు అందుబాటులో ఉన్నాయి. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేసేయండి!